ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి, 2025

5

శ్రీకాకుళం



మార్చి 8 వరకు 'మీకోసం' రద్దు


శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మార్చి 8 తేదీ వరకు ఆయా సోమవారాల్లో జిల్లాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం'ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయంలో ఫిర్యాదులను సమర్పించడానికి 'మీకోసం' ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉపయోగించుకోవచ్చని సూచించారు. తదుపరి మీకోసం నిర్వహించే తేదీని ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఎస్‌పి గ్రీవెన్స్ కూడా...

ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో, శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను మార్చి ఎనిమిదో తేదీ వరకు రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు వ్యయప్రయాసలకు గురై రావద్దని విజ్ఞప్తి చేశారు.

అంగరంగ వైభవంగా...

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, శోభాయాత్ర
- రసవత్తరంగా గ్రామీణ క్రీడా పోటీలు
- ప్రారంభమైన అరసవల్లి రథసప్తమి వేడుకలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ పండగగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో సామూహిక సూర్య నమస్కారాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు ఐదు వేల మంది సూర్య నమస్కారాలు చేశారు. ఈ వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శోభాయాత్ర ఆకట్టుకుంది. గ్రామీణ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లాలో తొలిసారి ఏర్పాటు చేసిన టూరిజం హెలీకాప్టర్ రైడ్ కొత్త అనుభూతినిచ్చింది.



శోభాయమానంగా శోభాయాత్ర

నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి నుంచి అరసవల్లి ఆలయం వరకు నిర్వహించిన శోభాయాత్రను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, థింసా, కోయ, కొమ్ము నృత్యాలు, పలు ఆలయాల ప్రచార రథాలు, మంగళ వాయిద్యాలతో కృష్ణాపార్కు, ఏడు రోడ్ల కూడలి, జి.టి రోడ్డు, సూర్యమహల్ కూడలి మీదుగా అరసవిల్లి వరకు శోభాయాత్ర సాగింది. రథసప్తమి వేడుకల్లో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రాలు మాట్లాడుతాయి పేరుతో 'సమగ్రత–సమానత్వం' అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో 645 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న హెలీకాప్టర్ రైడ్

నగరంలోని డచ్ భవనం వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యాన చేపట్టిన హెలీకాప్టర్ రైడ్ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, మంచు కారణంగా రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఒక్కో ట్రిప్పుకు ఏడుగురు ప్రయాణించేందుకు వీలు కల్పించారు. ఎనిమిది నిమిషాల్లో గగన మార్గంలో ఏడు ఆలయాలను చూసేందుకు ఒకరికి టిక్కెట్ రూ.1800 వసూలు చేశారు. నగర వాసులు హెలీకాప్టర్ ఎక్కేందుకు ఆసక్తి చూపించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ కుటుంబసభ్యులతో కలిసి ప్రయాణం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డ్వామా పీడీ సుధాకర్ హెలీకాప్టర్ రైడ్ చేశారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో రాష్ట్రస్థాయి వాలీబాల్, జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్, గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్ తదితర క్రీడా పోటీలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. తొలి రోజున ఆరు జిల్లాల నుంచి వాలీబాల్ క్రీడాకారులు తలపడ్డారు.



రథసప్తమి వేడుకల్లో సాంస్కృతిక సందడి



రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రముఖ కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. వేడుకల్లో భాగంగా లైట్ మ్యూజిక్, సినీ సంగీతం, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ జానపద సంగీతం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగాయి. ప్రముఖ కళాకారులు తమ గాన, నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. జబర్దస్త్ ఫేమ్ ఆటో రాంప్రసాద్, నరేష్, శాంతి స్వరూప్, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్ని సాంగ్ ఫేమ్ షణ్ముఖ్, సురేష్ రేష్మ (సింగింగ్), బాలాజీ వంటి ప్రముఖులు పాల్గొన్న ధూంధాం కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆటో రాంప్రసాద్ తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. జిల్లాలో తొలిసారి పరిచయం చేసిన లేజర్ షో ఆకర్షణగా నిలిచింది. ఈ షోలో రంగురంగుల కాంతులు ఆకాశంలో పలు ఆకారాలుగా ఏర్పడి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. శ్రీ అంజనా కళా సంస్థ సమర్పించిన పంచరత్న పౌరాణిక నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ నటీనటులు తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారు. ఈ నాటకాలు ప్రేక్షకులకు మంచి సందేశాన్ని అందించాయి. మరిన్ని కళా, సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలను సోమవారం కూడా నిర్వహించనున్నారు.



సూచనలు చేస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి

రథసప్తమి వేడుకలకు పటిష్ట బందోబస్తు

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రథసప్తమి వేడుకలకు 2,300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. నగరంలోని మిల్లు జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్కడ్నుంచి అరసవల్లి ఆలయం మార్గమధ్యంలో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. రోడ్డు మార్గంలో నిలిపిన వాహనాలను ట్రోయింగ్ వెహికల్‌తో క్లియర్ చేయించాలన్నారు. ఆలయం సింహద్వారం వద్ద యాత్రికుల రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం లోపల ప్రవేశం, తిరుగు వెళ్లే మార్గాలను పరిశీలించి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

విధి నిర్వహణ సిబ్బందికి ఎస్‌పి దిశానిర్దేశం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్‌పి మహేశ్వర రెడ్డి దిశానిర్దేశం చేశారు. మొత్తం బందోబస్తుని 20 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. ఎస్‌పి పర్యవేక్షణలో ముగ్గురు ఎఎస్‌పిలు, 15 మంది డిఎస్‌పిలు, 49 మంది సిఐలతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం 2,300 మందితో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా నుంచి సుమారు వెయ్యి మంది, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం సిటీ, ఇతర సైడ్ వింగ్‌ల నుంచి 1300 మంది పోలీసులను కేటాయించినట్లు వివరించారు. డ్రోన్, సిసి కెమెరాలను అనుసంధానం చేస్తూ యాత్రికులకు అందుబాటులో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

విద్యార్థినిపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థిని కొరికాన లక్ష్మిపై దాడి ఘటనలో నిందితుడు సారవకోట మండలం గోవర్ధనపురానికి చెందిన కణితి జగదీష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పదో తరగతి వరకు చదువుకున్న జగదీష్, ఆ తర్వాత చదువు మానేసి హైదరాబాద్ వెళ్లి సినిమా ప్రయత్నాలు చేస్తూ అక్కడే ఉన్నాడు. సీరియల్స్‌లో చిన్న పాత్రలు చేసి ఖాళీగా ఉన్నాడు. గతేడాది డిసెంబరులో బంధువుల ఫంక్షన్‌కు వచ్చి బస్సులో తిరిగి వెళ్తున్న సమయంలో పక్క సీటులో కూర్చొన్న సంతకవిటి మండలం కొండగూడెంకు చెందిన విద్యార్థిని లక్ష్మితో పరిచయమైంది. అప్పట్నుంచీ ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లు. గత నెల 30వ తేదీన హాస్టల్ నుంచి బయటకు వచ్చిన లక్ష్మి, జగదీష్ సాయంత్రం వరకు కలిసి తిరిగారు. తిరిగి హాస్టల్ వైపు వెళ్తున్న సమయంలో పెళ్లి ప్రతిపాదన చేయడంతో లక్ష్మి తిరస్కరించింది. దీంతో కోపోద్రిక్తుడైన జగదీష్ ఆమె గొంతు నొక్కి, ఎడమ కన్నుపై పిడిగుద్దులు గుద్ది గోడ వైపు తోశాడు. కింద పడిపోయిన లక్ష్మి కేకలు వేయగా, ఆమె మెడపై కాలు వేసి తొక్కాడు. లక్ష్మి స్పృహ కోల్పోవడంతో భయపడి ఆమె రెండు మొబైల్ ఫోన్లు తీసుకుని అక్కడ్నుంచి పారిపోయాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని ఆదివారం నగరంలోని కోటేశ్వర స్వామి ఆలయ సమీపంలో పట్టుకున్నారు. నిందితుడు నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కేసును చేధించడంలో కృషి చేసిన పోలీసులను ఎస్‌పి అభినందించారు.

మంచు దుప్పటి

మెళియాపుట్టి : మండలంలో మంచు దుప్పటి కమ్మేసింది. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో ఉదయం సమయంలోనే రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు పడ్డాడు. మంచు కురిసే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. ఈ సమయంలో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. వారం రోజులుగా మండలంలోని పలు ప్రాంతాల్లో మంచు తీవ్రత ఎక్కువగా ఉంది.

కవిటి: మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న పొగ మంచు ఉద్యానవన పంటలపై పగ పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల వరకు దట్టంగా కురుస్తున్న పొగమంచుకు రైతులు, స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ పొగమంచుతో జీడి, మామిడి పంటలకు టీ దోమ, బూజు తెగులు వంటివి వ్యాధులు వ్యాపించి నష్టపరిచే ప్రమాదం ఉందని ఉద్యానవన శాఖ అధికారి మాధవీ లత తెలిపారు.

మందస : జీడి, మామిడి పూత దశలో మూడు రోజులుగా పొగ మంచు కురుస్తుండడంతో తీవ్ర ప్రభావం చూపుతోందని రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్ల దోమ తెగులు ఆశించడం వల్ల పూత దశలోనే పంట పురిటిలోనే దెబ్బతింటుందని అన్నారు.



మెళియాపుట్టి : పట్టుపురం-మందస రోడ్డులో కురుస్తున్న మంచు

పార్కులో ఆహ్లాదం కరువు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రాంత ప్రజానీకానికి ఆహ్లాదకరం కల్పించాలనే ఉద్దేశంతో 2018లో ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత తాగునీటి పథకం సమపం జాతీయ రహదారి పక్కనే రూ.90 లక్షలతో కింజరాపు అచ్చెన్నాయుడు పార్కును ప్రారంభించారు. అనంతరం వినియోగించిన కొద్ది రోజుల్లోనే మూత పడింది. దీంతో రూ.లక్షల విలువైన నిధులు వృథా అయ్యాయి. పార్కులో ముళ్లచెట్లు పెరిగాయి. అపరిశుభ్ర వాతావరణానికి తోడు, అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. పిల్లల ఆటల కోసం ఏర్పాటు చేసిన పలు పరికరాలు ఏడాదికే శిథిలమయ్యాయి. పార్కులో ఏర్పాటుచేసిన ప్లాంట్ పనిచేయడం మానేశాయి. విద్యుత్ సౌకర్యం లేదు. దూరంగా వాకింగ్ ట్రాక్ వినియోగంలో లేదు. పార్కులోని తెలుగు తల్లి, ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు వంటి విగ్రహాలు సైతం రంగులు వెలిసి దయనీయమైన పరిస్థితిలో కనిపిస్తున్నాయి. రూ.90 లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కు ఎందుకూ పనికిరాకుండాపోయింది. ప్రభుత్వం మారడంతో పార్కుపై ఆశక్తి చూపకపోవడంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం పార్కుపై శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రాంత వాసులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న పార్కు

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సన్నద్ధం

● పరీక్షా కేంద్రల్లో సిసి కెమెరాలు ● ఆర్ఐఒ ప్రగడ దుర్గారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రగడ దుర్గారావు తెలిపారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో మాస్ కాఫీయింగ్, ఇతర రకాలైన అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. పరీక్షా కేంద్రల్లో సిసి కెమేరాల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాటిని జిల్లాలో ఆర్ఐఒ, రాష్ట్రస్థాయిలో ఇంటర్ బోర్డు కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉండేందుకు అనుసంధానిస్తున్నామన్నారు. ఇప్పటికే దాదాపుగా సిలబస్ పూర్తి చేయడంలో అధ్యాపకులు, కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నామని అన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు విషయాలు వివరించారు.





? పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ముందస్తు చర్యలు మొదలు పెట్టాం. ఇప్పటికే పరీక్షా కేంద్రాల గుర్తింపు పూర్తయింది. ముందుగా ఈ నెల పది నుంచి ప్రాక్టికల్ పరీక్షలు మొదలు కానున్నాయి. షెడ్యూల్‌ను అనుసరించి పరీక్షల నిర్వహణ మొదలు కానుంది. అందుకోసం విద్యార్థులకు అనువైన పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశాం. రవాణా సౌకర్యంతో పాటు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని కేంద్రాల ఎంపిక చేస్తున్నాం. గతంలో సమస్యాత్మకంగా ఉన్న కేంద్రాలను ఈసారి నిలుపుదల చేశాం. పరీక్షల నిర్వహణకు తరగతి గదులతో పాటు విద్యుత్, ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన ల్యాబ్‌లు అందుబాటులో ఉన్న కళాశాలల్లోనే పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తాం.

? మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి కేంద్రంలోని అన్ని గదుల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల ముఖచిత్రాలు వాటిలో నిక్షిప్తం చేయడం వల్ల అభ్యర్థులపై నిఘా ఉంటుంది. సాంకేతిక నిపుణుల కమిటీ ప్రతి కేంద్రానికీ వెళ్లి కనెక్షన్ ఇస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వంద శాతం ఇవి పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును కమిషర్ కార్యాలయం నుంచే చూడడానికి వీలుంటుంది. చూచి రాతలు, పరీక్షకు ఆలస్యంగా వచ్చే వారి విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. విద్యార్థులకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలిగితే స్పందించేందుకు కూడా వీలుంటుంది.

? పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సాకర్యాలు కల్పించనున్నారు?

జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలను సిద్ధం చేశాం. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పూర్తి సమర్థతతో ఉన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థులకు ఆయా ప్రాంతాల వారీగా సమయానుకూలంగా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను సిద్ధం చేసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

? ప్రశ్నాపత్రాల రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఇంటర్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల భద్రత అత్యంత కీలకం. ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం, వాటిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చడం ఎంతో కీలకం. తీసుకువెళ్లే వాహనాలు వెంట పోలీసుల రక్షణ ఉంటుంది. అలాగే పరీక్షా కేంద్రాలకు దగ్గరలో జిరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశాం.

? ఆలస్యమైన వారిని అనుమతిస్తారా?

నిర్దేశించిన వేళల్లో జరిగే పరీక్షలకు అరగంట ముందే కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అనుకోని ఘటనలు ఎదురైతే వారికి పరీక్ష ప్రారంభమైన తర్వాత 15 నిమిషాల వరకే లోపలకు అనుమతిచ్చేందుకు వీలుంటుంది. అనుకోని కారణాలతో (ఉదాహరణకు బస్సు ఆలస్యం) వంటి కారణాలకు మాత్రమే వెసులుబాటు కల్పించాలని బోర్డు నుంచి ఆదేశాలున్నాయి.

? పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే వారికి ఎలాంటి కోడ్ అమలులో ఉంటుంది?

పరీక్షల పర్యవేక్షణలో ఉన్నతాధికారులకు గుర్తింపు కార్డుల జారీ చేస్తున్నాం. ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్‌మెంట్ అధికారులే సెల్‌ఫోన్లను తీసుకెళ్లొచ్చు. వారూ ఆయా కేంద్రాల్లో ఫోన్ మాట్లాడటానికి వీల్లేదు. ఉన్నతాధికారులు ఫోన్ చేసేటప్పుడు మాత్రమే స్పందించాలి. ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్‌ను తీసుకెళ్లకూడదు. కేంద్రాల్లో ఇతరులు ప్రవేశించకుండా సబార్డినేట్ నుంచి చీఫ్ సూపరింటెండెంట్ వరకు అందరికీ ఐడీ కార్డులు జారీ చేస్తున్నాం.

? కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నారా?

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల కోసం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక నియంత్రణ విభాగాన్ని (కంట్రోల్ రూమ్) ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేటప్పుడు, కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా 08942 278151 నంబరును సంప్రదించాలని సూచించాం. మరోవైపు ప్రతి కేంద్రంలోనూ సిసి కెమెరా ఉండేలా చూసుకోవాలని చీఫ్ సూపరెంటెంట్లకు ఆదేశాలు జారీ చేశాం. పటిష్టమైన పర్యవేక్షణ ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద సెల్‌ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించాం. విధుల్లో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లకుండా ఆదేశించాం.

ప్రజాశక్తి
www.prajasakti.com



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్


నాయకత్వ లక్షణాలు ఉండాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతిఒక్కరికీ నాయకత్వ లక్షణాలు ఉండాలని, అప్పుడే సమాజం బాగుపడటానికి దోహదపడుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక రాజేంద్ర కాంప్లెక్స్‌లో జెసిఐ నూతన కార్యవర్గానికి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకుడు అంటే రాజకీయ నేత కాదని, అన్ని రంగాల్లో నాయకత్వం వహించే సత్తా ఉండాలి అన్నారు. సమాజ శ్రేయస్సుకు ముందడుగు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెసిఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ పుసర్ల రజత, జోనల్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్, ఛార్టర్ ప్రెసిడెంట్ అనుదీప్, టి.షణ్ముఖ, పవన్, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, జన్నల సంతోష్, సందక్ జాని, సాలీనా డిల్లీ పాల్గొన్నారు.

సిక్కోలు చిత్రాలు సక్సెస్ కావాలి

శ్రీకాకుళం అర్బన్: త్రిపుర మూవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సిక్కోలు చిత్రాలు సినిమా సక్సెస్ కావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. నగరంలోని బలగ మెట్టు శివాలయంలో సిక్కోలు చిత్రాలు సినిమా టైటిల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో సిక్కోలుకు చెందిన ఎందరో తమ ప్రతిభను నిరూపించుకున్నారని, అదే కోవలో సిక్కోలు చిత్రాలు యూనిట్ కూడా విజయం సాధించాలన్నారు. మంచి సందేశాత్మకమైన కథతో సిక్కోలు చరిత్రను ప్రజలకు తెలియజేసే రీతిలో సినిమాను నిర్మించాలని శంకర్ కోరారు. సినిమా నిర్మాణం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అయినప్పటికీ ఆ ఖర్చును భరిస్తూ నిర్మాతలు సినిమాలు తీస్తున్నారని తెలిపారు. ప్రేక్షకులు సినిమాను ఆదరించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి అందజేత

పోలాకి: అధైర్య పడవద్దు... అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేటకు చెందిన గొలివి ధనుంజయ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సిఎం సహాయ నిధి నుంచి రూ.30,786 మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పేద రోగుల చికిత్సకు అన్ని విధాలుగా సహాయ పడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.బి.రామన్న, పాగోటి అప్పలనాయుడు మాస్టారు, చెట్టు కృష్ణమూర్తి, సిహెచ్.చిన్నబాబు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట, కొమరల్తాడ, దేవనల్తాడ గ్రామాల రోడ్డు నిర్మాణ పనులు వేగవంతమవుతున్నాయని టిడిపి పార్లమెంటరీ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి గోవింద పాపారావు అన్నారు. ఈ మేరకు టిడిపి నాయకులతో కలిసి ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. తారు రోడ్డు నిర్మాణంపై మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేశారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం నడుంబిగించిందన్నారు. బిటి, సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నామని అన్నారు. కొమరల్తాడ మాజీ సర్పంచ్ నారాయణస్వామి, దేవునల్తాడ టిడిపి నాయకులు తులె అప్పారి, ఎస్.జె.పురం సర్పంచ్ అఖిల్ సైనార్, యోగేష్, కామేష్, ఉప్పాడ, సత్యం, బైపల్లి నారాయణ, కంబాల రాంబాబు, పెదిమల్లి సాయి పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గకు చెందిన దయాకర్ అనే బాలుడికి కొద్ది రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్యం చేయించడానికి ఆర్థికస్థోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న అంబేద్కర్ సింహ గర్జన యూత్ సభ్యులు, మాదిగుల సంఘ పెద్దలు, మహిళలు బాలుడి కుటుంబానికి మేమున్నాం అంటూ భరోసా ఇచ్చారు. మాదిగుల సంఘం సభ్యుల సమక్షంలో రూ.25,549 ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన కామిటి శ్రీను కుటుంబానికి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాదిగుల సంఘం పెద్దలు సిహెచ్.నేతాజీ, కె.రాము, యు.అప్పలరాజు, మీల జోగారావు, మోహనరావు, కేశవ, బి.కృష్ణారావు, సుగుణారావు, వనంద్, అప్పలస్వామి, భీమారావు, శంకరరావు, సురేష్, సింహాచలం, పాపారావు, చంద్రయ్య పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20 వార్డుకు చెందిన శిష్ట గోపి వైసిపి పట్టణ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలుపై పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బడగల బాలయ్య, అంబటి ఆనందరావు, గజ్జి బాలయ్య, బమ్మిడి సుధాకర్, పల్లెటి గణపతి, పినకాన ముకుందరావు, బగాది సింహాచలం, కొనారి ఆది, అర్జాల ఆదినారాయణ, కోనేరు కాళీదాసు, లండ రమణ, పల్లెటి కామేష్, ధర్మాపు మురళి, కోవిరి దేవరాజు, పెరిమల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం విజేతలకు హెలీ టూరిజం ఉచితం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆర్ట్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం డచ్ భవనం వద్ద అభినందించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా జిల్లాలో ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు, ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రథసప్తమి వేడుకల సందర్భంగా చిత్రాలు మాట్లాడుతాయి అనే పేరుతో చిత్ర లేఖన పోటీలను నిర్వహించారు. సమగ్రత సమానత్వం కాన్సెప్ట్‌పై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో 645 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన సెంట్ జోసెఫ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న కె.యశ్వంత్ సాయి, శ్రీ చైతన్య స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న ఎం.నేహ అభియత్, శాంతినికేతన్‌లో ఐదో తరగతి చదువుతున్న బి.రోషిని, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎవిఎన్ఎంహెచ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జి.దేవరాజు, ప్రభుత్వ హైస్కూల్ శ్రీకాకుళంలో పదో తరగతి చదువుతున్న సిహెచ్ ప్రేమ్ కుమార్, ఎపి ఎంఎస్ జి.సిగడాంలో పదో తరగతి చదువుతున్న కె.యాశితలు విజేతలుగా నిలిచారు. విజేతల చిత్రాలను కలెక్టర్ పరిశీలించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత హెలీటూరిజం విహారానికి అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చని పొలాలు నాశనం చేస్తే ఊరుకునేది లేదు

ప్రజాశక్తి- బూర్జ

పవర్ ప్లాంట్ పేరుతో పచ్చని పంట పొలాలు నాశనం చేస్తే ఊరుకునేది లేదని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బూర్జమాను గూడ తదితర గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గిరిజనులు పవర్ ప్లాంట్ ఏర్పాటు విషయమై చర్చించారు. గిరిజనుల పచ్చని పంట పొలాల్లో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే బంగారం లాంటి భూములు నాశనం అవుతాయని రవికుమార్ దృష్టికి గిరిజనులు తీసుకువచ్చారు. కేవలం పవర్ ప్లాంట్ కోసం 1600 ఎకరాల భూమిని నాశనం చేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన రవికుమార్ బంగారం లాంటి భూములను నాశనం చేయడానికి పూనుకోవడం సరికాదన్నారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం పవర్ ప్లాంట్ ఏర్పాటుతో గిరిజనులను ఇబ్బందికి గురిచేస్తే సహించేలేదన్నారు. పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తే



మాట్లాడుతున్న రవికుమార్

మిగతా భూములు కూడా బీడు భూములుగా మారిపోతాయన్నారు. అంతేకాకుండా గాలి, నీరు కలుషితమై ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా పరిస్థితులు మారుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచనను వెనక్కి తీసుకుని, గిరిజన గ్రామాల్లోని పొలాల్లో పవర్ ప్లాంట్ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు కె.గోవిందరావు, కె.నాగేశ్వరరావు, ఎస్‌టిసెల్ మండల అధ్యక్షులు సురేష్, గిరిజనులు ఉన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న నాయకులు

కబడ్డీ విజేత గొల్లమాకన్నపల్లి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గొల్లమాకన్నపల్లిలో అభయ ఆంజనేయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా కాశీబుగ్గ బిగ్ సి సెల్ షాపు, గ్రామ సంఘం, గ్రామ కమిటీ ఆధ్వర్యాన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలో గొల్లమాకన్నపల్లి టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్, వైసిపి యువజన నాయకులు మామిడి నరసింహమూర్తి, మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, మాకన్నపల్లి సచివాలయం రెవెన్యూ సర్వేర్ కొల్లి ఫాల్గుణ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల మధ్య, క్రీడాకారుల మధ్య సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల ప్రతిభ బయటపడుతుందన్నారు. అనంతరం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి 13 టీములు పాల్గొనగా ప్రథమ స్థానంలో గొల్లమాకన్నపల్లి నిలవగా, రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో పలాస మండలం మామిడిపల్లి, మందస మండలం బహడపల్లి విజేతలుగా నిలిచాయి. విజేతగా నిలిచిన గొల్లమాకన్నపల్లి జట్టుకు రూ.12 వేలు నగదు, ట్రోఫీ, శ్రీకాకుళం జట్టుకు రూ.10 వేలు నగదు, ట్రోఫీ, మూడో స్థానంలో జట్టు మామిడిపల్లికు రూ.5 వేలు నగదు, ట్రోఫీ, మందస మండలం బహడపల్లి జట్టుకు రూ.5 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



లావేరు : విద్యార్థికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి- లావేరు

గ్రంథాలయంలో సూర్య నమస్కారాలు

లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం యోగా శిబిరం నిర్వహించారు. మురపాక కెజిబివిలో ఆరవ తరగతి చదువుతున్న ఇజ్జు యోష్మిత సూర్య నమస్కారాలు వేసి విద్యార్థులతో చేయించారు. అలాగే పద్మాసనం, వజ్రాసనం, హాలాసనం, తడాసనంతో పాటు మరో 10 ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా తోడుంటే ఆరోగ్యము మీ వెంటే ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి యోగాసనాలు వేసినట్లయితే మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారని, పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించగలరన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం తరుపున ఆ విద్యార్థికి బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

పలాస : మండలంలోని నీలావతి ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రంథాలయానికి గ్రంథాలయ సలహాదారుడు, మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి 50 పుస్తకాలను ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి మానసిక వికాసానికి, సృజనాత్మకతకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో యువివి గౌరవాధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శి జినగ సీతారామయ్య, కె.సుధాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'తెప్పల'కు పురస్కారం

పలాస : శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం రంగస్థల సమాఖ్య 304వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాసకు చెందిన కళాకారుడు, రచయిత, సమాఖ్య కార్యవర్గ సభ్యుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి సమాఖ్య గౌరవాధ్యక్షులు రామలింగ స్వామి, న్యాయవాది మీగడ వినయ్ భూషన్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ నిక్కు అప్పన్న, నాటుకుల మోహన్, ప్రధాన కార్యదర్శి రామచందర్స్ దేవ్‌లు పురస్కారం అందజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించి అభినందించారు.

రామారావుకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వృత్తిపై నిబద్ధత కలిగిన వ్యక్తి, ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు ఇటీవల నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి రామారావు సేవా నిరతిని, కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్‌క్లబ్ ఉపాధ్యక్షులు ఉమాశంకర్, పిఆర్ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, సత్యమయ్య, బుజ్జి, కాళ్ల నరసింహమూర్తి, మండపల్లి ప్రధానోపాధ్యాయులు జాడు ప్రకాష్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు ఆర్థికసాయం

లావేరు: మండలంలోని కొత్తకోట పంచాయతీ జనసేన కార్యకర్త సంజయ్‌కు ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్షేన్ ఆయన వెళ్లడానికి వీలుకాకపోవడంతో రూ. పదివేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, కాకర్ల బాబాజీలు, సంజయ్‌ను పరామర్శించి పదివేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ త్వరగా కోలుకునే విధంగా మంచి వైద్యం అందేలా చూస్తామని చెప్పారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శులు వడ్డాది శ్రీను, తాళాబత్తుల పైడిరాజు, నాయకులు కాకర్ల బాబాజీ నాయుడు, కోలా రాజేష్, నీలంనాయుడు, కొంపెల్ల పవన్, రాము, రామకృష్ణ తదితరులున్నారు.

రథసప్తమికి ప్రత్యామ్నాయ మార్గం

నరసన్నపేట: రథసప్తమి సందర్భంగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారని, ఈ ప్రాంత వాహనదారులు గమనించాలని సిఐ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు పోలీస్‌స్టేషన్‌కు ముందు హైవేకి కుడి వైపున ఉన్న మారుతి సుజుకి ఎరీనా శాస్త్రులుపేట, సానివాడ గ్రామాల మీదుగా ఒప్పంగి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి వాడాడ కూడలి మీదుగా అరసవల్లి పుష్కరిణి సమీపానికి చేరుకోవాలన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 403వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో కమిటీ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆర్మీ జవాన్లకు ఘన స్వాగతం


ప్రజాశక్తి- పలాస

మండలంలోని కేదారిపురానికి చెందిన పాడి వేణుగోపాల్, పాడి త్రినాథ్ ఆర్మీ జవాన్లకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పాడి వేణుగోపాల్ 24 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మెరేడ్‌లో ఉద్యోగ విరమణ పొందారు. పాడి త్రినాథ్ 30 ఏళ్లుగా పనిచేస్తూ జమ్మూ-కాశ్మీర్‌లో దేశభద్రత దళంలో పనిచేస్తూ... ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ చేసి తొలిసారిగా గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామస్తులు పలాస రైల్వే స్టేషన్ వద్దకు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ నుంచి జంట పట్టణాలు మీదుగా ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చారు. వేణుగోపాల్ తన తల్లి పాడి బుద్దిమ్మకు తన టోపి తలకు పెట్టి వందనం చేశారు. అనంతరం ఆర్మీ జవాన్లుకు జాతీయ జెండా, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. మహిళలు హారతులు పట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడసింగి ధనుంజయ, పాడి దుర్యోధన, పాడి కిరణ్, పాడి ఈశ్వరరావు, బి.రమేష్, కొల్లి సోమేశ్వరరావు, పి.జగదీష్, పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పోలారావు రెడ్డికి నివాళి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ కీర్తిశేషులు పిలక పొలారావురెడ్డి వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లుపడ గ్రామం అచ్చంపేట కూడలి వద్ద ఉన్న పొలారావురెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి, ఇప్పిలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షులు ప్రకాశం పట్నాయక్, పిలక యాదవరెడ్డి, పరపతి కోటి, పరపతి దానయ్య, సుగ్గు ప్రేమ్‌కుమార్, జగన్, పిలక విజయభాస్కర్, కేశవపట్నం, హరినారాయణ, పోతల ఈశ్వరరెడ్డి, జిల్లా రెడ్డి తరగతుల అధ్యక్షులు లోకేశ్వరరెడ్డి, సల్ల దేవరాజు, రెడ్డి సంఘ ప్రతినిధులు ఆశ చిరంజీవులురెడ్డి,



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

లోకేష్ పాల్గొన్నారు. పొలారావురెడ్డి ఇద్దరు కుమారుతు పాల్గొకపోవడం చర్చనీయాశమైంది. ఏటా కుమారులు ఇద్దరూ దగ్గర ఉండి ఘనంగా నిర్వహించేశారు. కుమారులు అందుబాటులో లేకపోవడంతో కోడలు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి దగ్గరుండి కార్యక్రమం నిర్వహించారు.



చెత్తను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పరస్కరించుకొని అటవీశాఖ సిబ్బంది మండలంలో తెలుకంచు వలస పక్షుల సంరక్షణ కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెరువుల చుట్టూ పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వర్థాలను తొలిగించారు. పరిసరాలను శుభ్రం చేయించారు. చిత్తడి నేలలను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు అవగాహన కల్పించారు. చిత్తడి నేలలు అనేక రకాలైన మొక్కలకు, జంతువ్వులకు ఆవాసాలన్నారు. చిత్తడి నేలలో లభించే జలసంపద చేపలను ప్రజలు సేకరించి జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. నీటి శుద్ధి చేస్తాయన్నారు. వరదల నుంచి కాపాడుతాయన్నారు. పర్యావరణ కాపాడతాయని, భూతాపాన్ని తగ్గిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు రాము, భానుమూర్తి, వెంకటేష్, దుర్గాదేవి, లక్ష్మణమూర్తి, జోగారావు, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్‌లో స్కాలర్ షిప్ టెస్ట్‌కు భారీ స్పందన లభించింది. ఈ పరీక్షకు సుమారు 2 వేల మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. మండలం నడుకుదిటి పాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన స్కాలర్ షిప్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. నియోజవర్గం నలుమూలల నుంచి సుమారు 2వేల మందికి పైగా పరీక్షకు ముందుగానే హాజరై రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్ష రాశారు. విద్యార్థులందరికీ డైరెక్టర్ ఎన్.తేజబాబు ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఏర్పాట్లు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నిర్వహించింది. ఈ పరీక్షలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎన్ఇఆర్ స్కూల్ యాజమాన్యం ఇంటర్నేషనల్ స్థాయి విద్యతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించనుంది.

ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి ప్రయత్నం

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ విద్యను పేద, బడుగు, బలహీనవర్గాల వారికి దూరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం సమంజసం కాదని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న అన్నారు. ఆదివారం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జిఒను సవరిస్తున్నామని, లోపాలను గుర్తించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవానికి ప్రభుత్వ బడులు మూసేందుకే మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసేసి, ఫౌండేషన్ పాఠశాలల సంఖ్య పెంచి ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నారన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయకుండా తాత్సారం చేస్తూ లేనిపోని ప్రయోగాలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిటిఎఫ్ పొందూరు మండల బాధ్యులు గండెం రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని టెక్కలిపట్నం నుంచి రేగులపాడు అదే గ్రామానికి చెందిన శంకరరావు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గంమధ్యలో బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందజేశారు. వాహనంతో వచ్చిన సిబ్బంది సత్యం, రాజేష్ ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి- పొందూరు


మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో పాత కేసులు రాజీకి వచ్చే క్రమంలో చిలికిచిలికి గాలివానలా మారి ఇరు వర్గీయులు ఒకరిపై ఒకరు హత్యా ప్రయత్నం చేసుకోవడంతో ఇరు వర్గాలపై హత్యా యత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ సత్య నారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం కంచె రాము, కంచె పోలోడు మరికొంత మంది కలిసి పల్ల రాజు భార్య రోజా ఇంటికి వెళ్లి దాడి చేశారు. దీంతో రోజా ఇంటి బయటకు వచ్చి కేకలు వేయడంతో ఆ సమయంలో వీధిలో నుంచి కంచె సీతారాం వెళ్తుండగా పల్ల గంగాధర్ మరో పది మంది గ్రామంలోనే దాడి చేశారని చెప్పారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.



అదుపు తప్పి షాపులోకి దూసుకెళ్లిన లారీ

షాపులోకి దూసుకెళ్లిన లారీ

ఆమదాలవలస: మండలంలోని పార్వతీశంపేట దగ్గర ఓ లారీ ఆదివారం తెల్లవారుజామున టిఫిన్ షాప్‌లోకి దూసు కెళ్లింది. సరుబుజ్జిలి వైపు నుంచి శ్రీకాకుళం లోడుతో వెళ్తున్న ఈ లారీ పార్వతీశంపేట జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము కావడంతో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం, గాయాలు కాలేదు. పొగమంచు కారణంగా జరిగి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు.




అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

ఇచ్ఛాపురం : మండలంలోని భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులతో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం అర్బన్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలోఆదివారం శాంతినికేతన్ కళాశాలలో ఉత్తరావల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 101 నెలవారీ సాహితీ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు ఇద్ది పాపయ్య, నిక్కు అప్పన్న, ఐఎన్. డి.ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్, యు.నాగేశ్వరరావు, ముట్నూరు ఉపేంద్ర శర్మ, ఉమామహేశ్వరరావు, జె.శరత్ బాబు, చోడవరం ఈశ్వర రావు, బాలాజీ రవికిరణ్, కిమ్మి సంతోష్, రెడ్డి, లలితా రెడ్డి, తంగి ఎర్రమ్మ, పేరాజు, తెప్పల కృష్ణ మూర్తి తదితరులు రథసప్తమి సందర్భంగా ఆదిత్యుని వైభవంపై కవితలు చదివి వినిపించారు. సమావేశంలో జంధ్యాల శరత్‌బాబు, తెప్పల కృష్ణ మూర్తి, కిమ్మి సంతోష్, రెడ్డి లలిత, పేరాజు, జగన్నాధ రావుకు ఘనంగా సన్మానించి మెమెంటో అందించారు.



కవి సమ్మేళనంలో సత్కారాన్ని అందుకుంటున్న శరత్‌బాబు

రహదారి మలుపులో మైనింగ్ చెక్‌పోస్టు

భయాందోళనలో వాహనదారులు



మలుపు వద్ద ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టు

పొందూరు: మండలంలో పుల్లాజీపేట (రెడ్డిపేట) వద్ద రహదారి మలుపులో మైనింగ్ చెక్‌పోస్టు కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందంటూ పలువురు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. చిలకపాలెం - పొందూరు మధ్యన రెడ్డిపేట వద్ద ఎఎన్ఆర్ సంస్థ వాహనాల తనిఖీ కోసం మైనింగ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసింది. ఇది ఆంధ్రా-ఒడిస్సా అంతరాష్ట్ర రహదారి కావడంతో అన్నిరకాల వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో క్వారీలు ఎక్కువగా ఉండడంతో ఈ రహదారి వెంబడి పలుచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అయితే ఈ మలుపు వద్ద చెక్‌పోస్టు కారణంగా తనిఖీల కోసం క్వారీ లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లను నిలుపుదల చేస్తుంటారు. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు మలుపు వద్ద నిలుపుదల చేసి ఉన్న వాహనాలు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గతంలో ఈ రహదారిలో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే ప్రాంతం ఇదే కావడంతో రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందే అధికారులు స్పందించి చెక్‌పోస్టును మలుపు వద్ద కాకుండా సమీపంలోకి మార్చాలంటూ పలువురు కోరుతున్నారు.

తెలుగు మాధ్యమాన్ని విస్మరించారు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020లో మాతృభాషలకు ప్రాధాన్యం పెంచమని చెబుతుంటే రాష్ట్రంలో మాత్రం పూర్తిగా తెలుగు మీడియం లేకుండా ఇంగ్లీషులో బోధన చేస్తూ తెలుగును కనుమరుగు చేయటానికి పాలక వర్గం కంకణం కట్టుకోవడం ఆందోళన గురిచేస్తుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ మాతృభాషలో బోధన జరిగితేనే పిల్లలు సునాయాసంగా నేర్చుకోగలుగుతారని, సృజనాత్మక ఆలోచనలకు దోహద



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రమణ

పడుతుందన్నారు. అందుకే మాతృ భాషలోనే బోధన జరగాలని ఈ విధంగా ఇంగ్లీష్ భాషకు దూరంగా మాతృభాషలోనే విద్యను బోధిస్తున్న చైనా, జపాన్ వంటి దేశాలు నూతన ఆవిష్కరణలో ఆగ్రగామిగా నిలుస్తున్నా రన్నారు. ఎక్కువమంది ఉపాధ్యాయుల అవసరం అవుతున్నారని తెలుగు మీడియంను పూర్తిగా రద్దుచేసి ఒక ఇంగ్లీష్ మీడియంను కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల బోధనకు అనువుగా ఉండేలా రెండు రకాల మీడియంలు అందుబాటులో ఉండాలన్నారు. పాఠశాలల్లో సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బకాయిల విడుదల, ఐఆర్, పిఆర్‌సిలపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మన్యం జిల్లా అధ్యక్షులు పి.పురుషోత్తం, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, పి. వసంతకుమారి, సిహెచ్ జగన్, ఎన్. లక్ష్మణరావు, వసంతకుమారి, తేజేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, పలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.